సాక్షి గుంటూరు

గురువారం । 15 । ఆగస్టు । 2024



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట : పులిచింతల ప్రాజెక్టులో నీటి నిల్వ బుధవారం సాయంత్రానికి 40.77 టీఎంసీలకు చేరింది. ప్రాజెక్టు గేట్లు మొత్తం మూసివేశారు.



కాల్వ పూడికతీత

కారెంపూడి: స్థానిక పెదకొదమగుండ్ల మేజర్ కాల్వలో బుధవారం కాల్వ చివరి భూముల రైతులు పొక్లెయిన్‌తో పూడిక తీత పనులు నిర్వహించారు.



49,968 బస్తాల మిర్చి రాక

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 49,968 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 47,894 బస్తాలు అమ్మకాలు జరిగాయి.

పేద రోగికి పెద్ద కష్టం..!

- ఆస్పత్రుల్లో అందని వైద్య సేవలు
- ప్రభుత్వ పెద్దల తీరుతో పెనుభారం
- ఓపీ వద్ద గంటలపాటు నిరీక్షణ
- వైద్యుల వద్దకు వెళ్లినా అదే అవస్థ
- పరీక్షలు బయటే.. మందులకూ అంతే
- సమయపాలన పాటించని సిబ్బంది

ఉమ్మడి రాష్ట్రంలోనే పేదల పెద్దాస్పత్రి అది.. ఇప్పుడు ప్రభుత్వ పెద్దల తీరుతో నిరుపేదలకు ఇక్కడి సేవలు పెను భారంగా మారాయి. ఎంతో ఆశగా వచ్చి ఓపికగా వేచి చూసి వైద్య సేవలు పొందాలన్నా నరకయాతన పడాల్సిందే. పేదలంటే చులకనగా చూసే కూటమి ప్రభుత్వ హయాంలో రోగులకు నిత్యం కష్టాలు తప్పడం లేదు.

సాక్షి ప్రతినిధి, గుంటూరు, గుంటూరు మెడికల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పేదల పెద్దాస్పత్రిగా పేరుగడించిన గుంటూరు జీజీహెచ్‌లో సమస్యలు తిష్టవేశాయి. జిల్లాలోని సుదూర ప్రాంతాలతో పాటు, సుమారు ఆరు జిల్లాలకు చెందిన రోగులు చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు వస్తున్నారు. రోజుకు మూడు వేలకు పైగా ఓపీ ఉంటే సోమవారం నాలుగు వేల వరకూ ఉంటుంది. క్యూలు పెద్దగా ఉండటంతో ఆస్పత్రిలో ఓపీ చీటీ తీసుకుని వైద్యుడి వద్దకు రోగి వెళ్లేందుకు గంటకుపైగా సమయం పడుతోంది. వైద్యుడు రోగిని పరిశీలించి, పరీక్షలు రాసి అవి వచ్చేసరికి వైద్యుడు ఉండటం లేదు. దీంతో రోగులు వ్యయ ప్రయాసల కోర్చి పెద్దాస్పత్రికి వచ్చినా తమకు చికిత్స అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

‘ప్రైవేటు’ దిశగా సర్కారు అడుగులే కారణం



‘ఓపి’క ఉండాల్సిందే : ఔట్ పేషెంట్ విభాగం వద్ద నమోదుకు పెద్ద క్యూలైనులో రోగులు

టెస్టులు, మందులు బయటే

షుగర్, థైరాయిడ్ నిర్ధారణ పరీక్షలు ఆస్పత్రిలో అందుబాటులో లేవు. కొన్ని రకాల యాంటిబయోటిక్స్ మందులూ లేవు. వీటికోసం రోగులు బయటకు వెళ్లాల్సిందే. వ్యాధి నిర్ధారణ పరీక్షలకు ఉదయం నుంచి సాయంత్రం వరకు రోగులు పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రోగుల వద్ద నుంచి రక్త నమూనాలు, ఇతర శాంపిల్స్ వైద్య సిబ్బంది సేకరిస్తున్నారు. భోజన విరామం అనంతరం ల్యాబ్ రిపోర్ట్‌ల కోసం మూడు గంటలకు రోగులు రావాల్సి వస్తోంది. తీరా ఆ సమయంలో రిపోర్టులు తీసుకుని ఓపీ విభాగాలకు వెళితే కొన్ని ఓపీ విభాగాలు పూర్తిగా మూత వేసి ఉంటున్నాయి. కొన్ని ఓపీ విభాగాల్లో జూనియర్ వైద్యులు ఉండి తమకు తెలిసిన మందులను రోగులకు రాస్తున్నారు. ఆ మందులూ ఆస్పత్రిలో అందుబాటులో ఉండడం లేదు. పరీక్షలూ బయటే చేయించుకోవాల్సి రావడంతో రోగుల జేబులకు చిల్లులు పడుతున్నాయి.

SAKSHI సాక్షి గ్రౌండ్ రిపోర్టు GROUND REPORT

సమయపాలన పాటించడం లేదు

సీనియర్ వైద్యులు, విభాగాధిపతులు, ప్రొఫెసర్లు నిబంధనల ప్రకారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆస్పత్రిలో విధుల్లోనే ఉండాలి. ఎక్కువ మంది వైద్యులు మధ్యాహ్నం ఒంటిగంటకల్లా ఇళ్లకు వెళ్లిపోతున్నారు. సాయంత్రాలు ప్రైవేటు ప్రాక్టీసుల్లో తరిస్తున్నారు. ఫలితంగా క్లిష్టమైన కేసులనూ జూనియర్ వైద్యులే చూడాల్సిన దుస్థితి నెలకొంది.

అంతటా అపరిశుభ్రత

రోగులకు వడ్డిస్తున్న భోజనం కూడా నాణ్యంగా ఉండటం లేదనే విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా భోజనశాల అస్తవ్యస్తంగా ఉంది. ఆహారం వండే పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. ఇన్‌పేషెంట్, అవుట్‌పేషెంట్ విభాగాల్లో మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. డోర్లు, వాష్‌బేసిన్లు, వాటర్ పైపులైన్లు, సక్రమంగా లేవు. ఫలితంగా అవస్థలు తప్పడం లేదు. తాగునీటి కోసం తిప్పలు తప్పడం లేదు.



మారదు మా తీరు: వీల్‌చైర్‌లో వివిధ వస్తువులు తీసుకెళుతున్న సిబ్బంది

మార్చురీలో మామూళ్లు

చికిత్స పొందుతూ చనిపోయిన వారికి పోస్టుమార్టం తప్పనిసరి. దీనికి సిబ్బంది రూ. 5 వేల నుంచి రూ. 10 వేలు డిమాండ్ చేస్తున్నట్లు మృతుల బంధువులు ఆరోపిస్తున్నారు. ఇన్సూరెన్సులు క్లయిమ్ చేసుకునేందుకు అనుకూలంగా నివేదిక ఇవ్వాలంటే మృతుల సంబంధికుల నుంచి మామూళ్లు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. మృతదేహాలను స్వస్థలాలకు ఉచితంగా తరలించేలా ప్రభుత్వం మహాప్రస్థానం అంబులెన్సులను అందుబాటులో ఉంచింది. అయితే రాత్రి వేళల్లో ఈ వాహనాలు అక్కడ ఉండటం లేదు. దీంతో మృతదేహాలను స్వగృహాలకు తరలించేందుకు మృతుల కుటుంబ సభ్యులకు రూ.వేలు ఖర్చవుతున్నాయి.



రక్త పరీక్షకు వరుసలో వేచి ఉన్న రోగులు

నివేదికలకు వారాలు ఆగాలి..

అల్ట్రాసౌండ్ స్కానింగ్, టూడీ ఏకో, సిటీస్కాన్, ఎమ్మారై స్కాన్ లాంటి వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం కొన్ని సందర్భాల్లో వారాల తరబడి రోగులు నిరీక్షించాల్సి వస్తోంది. దీంతో కొన్నిసార్లు ఆపరేషన్లూ వాయిదా పడుతున్నాయి.



రోగికి సాయం చేసేదెవరు?

ఆస్పత్రిలో నాల్గో తరగతి ఉద్యోగుల కొరత తీవ్రంగా ఉంది. దీంతో రోగులను ఓపీ నుంచి వార్డులకు, వార్డుల నుంచి పలు వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం రోగుల సహాయకులే తరలించాల్సి వస్తోంది. కొన్ని సందర్భాల్లో ఓపీ వైద్య విభాగాల్లో స్ట్రెచర్లు, వీల్‌చైర్‌లు రోగులకు సరిపడా అందుబాటులో ఉండడం లేదు. దీంతో బంధువులు రోగులను మోసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.





పుట్టగానే కష్టాలు : శిశువులకూ తప్పని క్యూలు



రోగిని స్ట్రెచర్‌పై తీసుకెళుతున్న కుటుంబసభ్యులు



‘నడక’యాతన: రోగిని నడిపించుకుంటూ తీసుకెళుతున్న కుటుంబసభ్యులు

తప్పని పడిగాపులు

కొద్ది రోజులుగా అనారోగ్యంగా ఉండటంతో పీహెచ్‌సీలో వైద్యులను సంప్రదించా. వారు గుంటూరు జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. ఉదయం వస్తే 11 గంటలకు వైద్యుల వద్దకు వెళ్లా. తీరా వైద్యులు పరీక్షలు రాసి రిపోర్టులు తీసుకుని రమ్మని చెప్పారు. రిపోర్టులు తీసుకొని వెళ్లే సరికి పెద్ద డాక్టర్ అందుబాటులో లేరు. మళ్లీ మరో రోజు వ్యయ ప్రయాసలకోర్చి రావాలి.

– సాంబయ్య, కాకుమాను, గుంటూరు జిల్లా

మందులు లేవన్నారు..



యూరాలజీ సమస్యతో జీజీహెచ్‌కు ఈనెల 10న చికిత్స కోసం వచ్చా. వైద్యులు పరీక్షలు చేసి మళ్లీ 12వ తేదీన రమ్మన్నారు. మందులు వాడితే సమస్య తగ్గుతుందని చెప్పారు. ఐదు రకాల మందులు కూడా రాశారు. కౌంటర్‌లోకి వెళ్లి అడిగితే.. రెండు రకాల మందులే ఇచ్చారు. మిగతావి బయట కొనుగోలు చేశా. అసలే బయట ధరలు భరించలేక నాలాంటి వారు ప్రభుత్వ ఆస్పత్రికి వస్తున్నారు. ఇక్కడా మందులు లేకపోతే ఏం చేయాలి? ఎక్కువ ధరకు మందులు కొనలేక ఇబ్బంది పడుతున్నాం. అన్ని రకాలు ప్రభుత్వం అందుబాటులో ఉంచాలని కోరుకుంటున్నాం.

– మొహమ్మద్ వాసి, గుంటూరు

పారిశుద్ధ్యం అధ్వానం

కొద్దిరోజులుగా కడుపులో నొప్పితో బాధపడుతూ గ్రామంలోని వైద్యుల సూచనల మేరకు గుంటూరు జీజీహెచ్‌కు చికిత్స కోసం వచ్చాను. వైద్యులు మూత్ర పరీక్ష చేయాలని సూచించారు. మరుగుదొడ్లకు వెళితే డోర్లు లేవు. వాటర్ సరఫరా సక్రమంగా లేదు. చాలా అస్తవ్యస్తంగా ఉన్నాయి. దుర్వాసన వస్తోంది.

– సురేష్, రెంటచింతల, పల్నాడు జిల్లా

స్వాతంత్య్ర వేడుకలకు పరేడ్ గ్రౌండ్ ముస్తాబు



సిద్ధమైన వేదిక



జాతీయ జెండాల అలంకరణ

గుంటూరు వెస్ట్: స్వాతంత్య్ర దిన వేడుకలకు స్థానిక పోలీస్ పరేడ్ మైదానం అత్యంత సుందరంగా ముస్తాబైంది. భారీ వేదికతోపాటు రంగురంగుల ముగ్గులు, గ్యాలరీలు, స్టాల్స్ తదితర ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, ఎస్పీ సతీష్ కుమార్, ఇతర జిల్లా అధికారులు వీటిని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ఐటీ శాఖామంత్రి నారా లోకేష్ జాతీయ జెండాను ఆవిష్కరిస్తారన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిమిత్తం వచ్చే చిన్నారులకు తాగునీరు అందుబాటులో ఉంచి, ఎండ తగలకుండా కార్యక్రమం సజావుగా సాగేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పార్కింగ్ ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. గురువారం ఉదయం 9 గంటలకు జాతీయ జెండా ఆవిష్కరణ తర్వాత మధ్యాహ్నం 12:15 గంటల వరకు వివిధ కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ పి.శ్రీకర్, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, సివిల్ సప్లెస్ డీఎం లక్ష్మి, డీఎస్ఓ కోమలి పద్మ తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, జేసీ భార్గవ్ తేజ

ముస్లిం యోధులకు జైహింద్



స్వాతంత్య్ర కాంక్షతో అగ్నికణికలై రగిలిన తెనాలి యోధులెందరో.. బలిదానాలతో దేశమాతకు స్వేచ్ఛా ఊపిరిలూదిన అమరులెందరో.. నుదిటన నెత్తుటి తిలకం దిద్ది జైహింద్ అంటూ నినదించిన ముస్లిం పోరాట వీరులెందరో.. స్వరాజ్య ఉద్యమానికి జీవితాలను ధారపోసిన త్యాగధనులెందరో.. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఆ మహనీయులను స్మరించుకోవడం మన కర్తవ్యం. ఈ నేపథ్యంలో కొందరు ముస్లిం దేశభక్తుల గురించి ఓ సారి తెలుసుకుందాం. – తెనాలి

- స్వరాజ్య సాధనలో పోరాడిన తెనాలి వీరులు
- అతివాద, మితవాద పోరాటాల్లోనూ కీలక భూమిక
- స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా త్యాగధనుల స్మరణ

ఖద్దరు ఇస్మాయిల్..




గాంధీని అనుసరించిన దేశభక్తుల్లో మహమ్మద్ ఇస్మాయిల్ ఒకరు. మిత్రుడు వేల్పుల గంగయ్యతో కలిసి స్వరాజ్య ఉద్యమ బాట పట్టారు. ఇద్దరూ కలిసి గాంధీ సూక్తులను ఆదర్శంగా తీసుకుని ఖద్దరు ఉత్పత్తిని, వాడకాన్ని ఉద్యమంలా చేపట్టారు. 1926లో జిల్లాలోనే తొలిసారిగా తెనాలిలో ఖద్దరు షాపు ఆరంభించారు. రాట్నం, దారం తీయటానికి దూది, చిలపలు, తకలీలు వంటి సామగ్రిని ఆసక్తి గల వారికి అందించారు. ఖద్దరు తయారీని, గ్రామీణ కుటీర పరిశ్రమల ప్రోత్సాహానికి కృషి చేశారు. ఆయనతోపాటు ఆయన భార్య హజరాబీ ఖద్దరు దుస్తులే ధరించేవారు. అప్పట్లో ఇస్మాయిల్ ఖద్దరు షాపు స్వాతంత్య్రయోధులకు రహస్య స్థావరమైంది. అందుకే ఖద్దర్ ఇస్మాయిల్‌గా పేరుగడించారు. 1948లో ఆయన కన్నుమూశారు.

జిందాబాద్.. అబ్దుల్ అజీం




తెనాలికే చెందిన సయ్యద్ అబ్దుల్ అజీం చిన్నవయసులోనే గాంధీజీ ఆశీస్సులు అందుకున్నారు. స్వరాజ్య ఉద్యమంలో మహాత్మా గాంధీ, కస్తూర్బా ప్రయాణిస్తున్న రైలులో విరాళాలు సేకరించి తన పాకెట్‌మనీతో సహా గాంధీకి అందజేశారు. మరోసారి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వెళ్తున్న రైలులో తన బృందంతో సహా ప్రయాణించారు. గుంటూరులో నేతాజీ సభకు సైకిలుపై వెళ్లి, ఆయన ప్రసంగం విని పులకించిపోయారు. ఉప్పు సత్యాగ్రహంలో లాఠీదెబ్బలు తిన్నారు. క్విట్‌ఇండియా ఉద్యమంలోనూ కీలకంగా వ్యవహరించారు. పోలీసుల వేటకు దొరక్కుండా చెన్నై వెళ్లి, కొన్ని నెలలపాటు అక్కడే ఉద్యమకారులతో పనిచేశారు. 1945లో మున్సిపల్ సర్వీసులో చేరినా ఉద్యమ కార్యకలాపాలను కొనసాగించారు. దేశ విభజనను వ్యతిరేకించారు. స్వాతంత్య్రయోధునిగా ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను కోరుకోలేదు.

వహ్వా.. గాంధేయవాది అబ్దుల్ వహాబ్



నైతిక విలువలనే ఆస్తిపాస్తులుగా భావించి ఆదర్శ జీవనం గడిపిన గాంధేయవాది షేక్ అబ్దుల్ వహాబ్ బహదూర్. స్వరాజ్య ఉద్యమంలో కీలక భూమిక పోషించిన దీక్షాదక్షుడు. తెనాలిలో షేక్ ఇమాంబీ, ఫరీదాసాహెబ్ దంపతులకు 1903 డిసెంబరు 10న జన్మించారు. 1929లో గాంధీజీ తెనాలి వచ్చినపుడు వహాబ్ తన సతీమణి ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను విరాళంగా ఇచ్చారు. దేశ విభజన ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించారు. అప్పట్లో హిందూ–ముస్లిం కలహాలు రేగినప్పుడు అందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చారు. పద్మశాలిపేటలోని మదీనా మసీదు ఎదుటి వీధికి హిందూ–ముస్లిం రోడ్డుగా నామకరణం చేశారు. 1963 నుంచి 1965 వరకు న్యాయమూర్తి వ్యవహరించారు. 36 ఏళ్లపాటు మున్సిపల్ కౌన్సిలర్‌గా, 1943–44లో మున్సిపల్ చైర్మన్‌గా చేశారు. ముస్లిం సామాజికవర్గం నుంచి తొలి చైర్మన్‌గా గుర్తింపును పొందారు. అప్పట్లో కొత్తవంతెన నుంచి హనుమాన్‌చౌక్ వరకు రోడ్డు నిర్మించారు. మధ్యలో ప్రాంతాన్ని వహాబ్‌చౌక్‌గా ప్రభుత్వం నామకరణం చేసింది. అక్కడున్న తన సొంత స్థలాన్ని పార్కు కోసం ఇచ్చారు. తర్వాత దానిని వహాబ్ రీడింగ్ రూమ్‌గా మార్చారు. బుర్రిపాలెంరోడ్డులోని విలువైన 1.5 ఎకరాల స్థలాన్ని ప్లాట్లుగా వేయించి పేదల గృహనిర్మాణం కోసం ఇచ్చేశారు. ఉప్పుబజారులో వహాబ్ పేరుతో పోస్టాఫీసు నడుస్తోంది. స్వాతంత్య్రయోధుడిగా ప్రభుత్వ పింఛను, ఇతర రాయితీలను నిరాకరించిన మహోన్నత వ్యక్తిత్వం వహాబ్ సొంతం. బ్రిటిష్ ప్రభుత్వం ఆయనకు ‘రావు బహద్దూర్’ బిరుదును ప్రదానం చేయడం గమనార్హం.

మస్తాన్ నినాదం మేరా హిందూస్తాన్



మున్షీ సయ్యద్ మొహమ్మద్ మస్తాన్ బేగ్ విద్యార్థి దశలోనే జాతీయోద్యమానికి ఆకర్షితులై జాతీయ కాంగ్రెస్ సభ్యత్వం స్వీకరించారు. 1932 నాటి శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నారు. శాంతియుత నిరసనలు నచ్చకపోవటంతో విప్లవకారులతో రహస్య కార్యకలాపాల్లో కొనసాగారు. ప్రముఖ విప్లవకారుడు అన్నాప్రగడ కామేశ్వరరావు నాయకత్వంలో ప్రకాశం జిల్లా కొత్తపట్నంలో జరిగిన రహస్య రాజకీయ శిక్షణ శిబిరానికి హాజరయ్యారు. ఫలితంగా 21 రోజులు పోలీసుల హింసకు గురయ్యారు. మద్రాస్ విశ్వవిద్యాలయంలో ఉర్దూ గ్రాడ్యుయేషన్ చేసి 1942లో తెనాలిలో ఉర్దూ ఉపాధ్యాయుడిగా చేరారు. అదే ఏడాది క్విట్ ఇండియా ఉద్యమంలో పోలీసు కాల్పుల నుంచి తృటిలో తప్పించుకున్నారు. 1943లో అన్నాప్రగడ నాయకత్వంలోనే ఊరేగింపులో పాల్గొని, జైలుపాలయ్యారు. ఆ తర్వాత మరోసారి అరెస్టు వారెంటు జారీకావటంతో అజ్ఞాతంలోకి వెళ్లి ఉద్యమ ప్రచారంలో కొనసాగారు. భారత విభజనకు వ్యతిరేక ప్రచారమూ చేశారు. 1999లో మృతిచెందారు.



ఇతర ముస్లిం దేశ భక్తులు



- షేక్ మహబూబ్ ఆదాం స్వాతంత్య్ర ఉద్యమంలో జైలు జీవితం అనుభవించారు. తర్వాత పూర్తి కాలపు కమ్యూనిస్టుగా మారారు. పార్టీ ఆదేశాలపై ముస్లింలీగ్‌లో చేరారు. ప్రభుత్వమిచ్చే తామ్రపత్రాన్ని స్వీకరించలేదు.



- ఉర్దూపై అభిరుచితో అదీబ్–ఏ–ఫాజిల్ చేసిన మున్షీ సయ్యద్ మహబూబ్, తర్వాతనుంచి మున్షీ మహబూబ్ అయ్యారు. తెనాలిలో ముస్లింలీగ్ నిర్మాణం కోసం ఎంతగానో శ్రమించారు. జాతీయోద్యమంలో పాల్గొంటూనే కమ్యూనిస్టు ఉద్యమంలో మమేకమయ్యారు. ఈ కృషికి గుర్తింపుగా ఉమ్మడి మద్రాస్ రాష్ట్ర లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యత్వం వరించింది.



- పఠాన్ మస్తాన్‌ఖాన్. 1938లో ముస్లింలీగ్ పార్టీ విభాగాన్ని స్థాపించి కార్యదర్శిగా చేశారు. పలుసార్లు జైలుకెళ్లారు.

నేడు ట్రాఫిక్ మళ్లింపు

నగరంపాలెం: స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో గురువారం స్వాతంత్య్ర దిన వేడుకల దృష్ట్యా ఉదయం 6 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రమేష్ హాస్పిటల్ నుంచి అంకమ్మనగర్, పట్టాభిపురం, జ్యూట్ మిల్, గుజ్జనగుండ్ల వైపు వెళ్లే వాహనాలు.. నగరంపాలెం ఎస్‌బీఐ జంక్షన్ నుంచి ఐటీసీ, హైవే మెయిన్‌రోడ్డు, చుట్టుగుంట సెంటర్ వద్ద యూటర్న్ తీసుకొని కలెక్టర్ బంగ్లా, అంకమ్మనగర్ ఫ్లైఓవర్ మీదుగా వెళ్లాలని సూచించారు. చుట్టుగుంట వైపు నుంచి ఐటీసీ మీదగా వెళ్లాల్సిన వాహనాలు అదే రోడ్డు దర్గా సమీపంలోని చెక్కల బజార్ మీదగా వెళ్లాలని చెప్పారు. మెడికల్ కళాశాల నుంచి ఐటీసీకి వెళ్లే వారు ఎస్‌బీఐ వద్ద ఎడమ వైపునకు తిరిగి, వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహం వద్ద యూటర్న్ తీసుకోవాలని, ఆపై ఎస్‌బీఐ జంక్షన్ మీదగా ఐటీసీ వైపు వెళ్లాలని కోరారు.

ఢిల్లీ వర్క్‌షాప్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ ప్రసంగం



గుంటూరు ఎడ్యుకేషన్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన మహిళా ప్రజాప్రతినిధులతో బుధవారం ఢిల్లీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అంతర్జాతీయ కేంద్రంలో జాతీయస్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. దీనికి ఆహ్వానం అందుకున్న ఉమ్మడి గుంటూరు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా కార్యక్రమంలో పాల్గొన్నారు. పంచాయతీ రాజ్ సంస్థల తరఫున భారత్‌లో గ్రామీణాభివృద్ధికి కార్యాచరణ రూపకల్పనపై జరిగిన వర్క్‌షాప్‌లో ఆమె ఈ సందర్భంగా ప్రసంగించారు. గ్రామీణ భారత్ అభివృద్ధికి ఆమె తనవంతుగా పలు సూచనలు ఇచ్చారు.

క్లుప్తంగా

పేదల కడుపు నింపేలా అన్న క్యాంటీన్‌లు

పురపాలక శాఖ మంత్రి నారాయణ



నెహ్రూనగర్: ఎన్టీఆర్ అన్న క్యాంటీన్ల పునఃప్రారంభం ద్వారా పేదల కడుపు నింపే బృహత్తర కార్యక్రమానికి స్వాతంత్ర్య దినోత్సవాన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టనున్నారని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. బుధవారం రాత్రి గుంటూరులోని చుట్టుగుంటలోని ప్రారంభోత్సవానికి సిద్ధం చేసిన అన్న క్యాంటీన్‌ను మంత్రి నారాయణ, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యురాలు గళ్లా మాధవి తదితరులు పరిశీలించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఈ శ్యాం ప్రసాద్, ఈఈ సుందరరామిరెడ్డి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

నార్త్ జోన్ డీఎస్పీగా మురళీకృష్ణ



మంగళగిరి: మంగళగిరి నార్త్ జోన్ డీఎస్పీగా సీహెచ్ మురళీకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం బాపట్ల డీఎస్పీగా ఆయన విధులు నిర్వర్తిస్తున్నారు. రెండు రోజులలో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు.

203 పరుగుల ఆధిక్యంలో తూర్పు గోదావరి జట్టు

మంగళగిరి: ఏసీఏ అండర్- 19 మెన్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీలలో బుధవారం రెండో రోజు ప్రకాశం జట్టుపై ఈస్ట్ గోదావరి జట్టు 203 పరుగులు ఆధిక్యత సాధించింది. ఈ పోటీలు మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నవులూరు అమరావతి టౌన్‌షిప్‌లో ఉన్న ఏసీఏ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరుగుతున్న విషయం తెలిసిందే. తొలుత బ్యాటింగ్ చేసిన ఈస్ట్ గోదావరి జట్టు 112.2 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 369 పరుగులు సాధించింది. ఆ జట్టు బ్యాట్స్‌మెన్ ఎస్‌వీ ఆనంద్ 103 పరుగులు సాధించాడు. బ్యాట్స్‌మెన్లు డి. ఆకర్ష్ 67, ఎస్‌వీ ప్రణయ్ 58 పరుగులతో రాణించారు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన ప్రకాశం జట్టు 17 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 45 పరుగులు చేసింది. మూడో రోజు ఆట గురువారం కొనసాగనుంది.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత



లక్ష్మీపురం: పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి తెలిపారు. గుంటూరు కన్నావారితోటలోని జీఎస్టీ భవన్‌లో విశ్రాంత ఉద్యోగులకు బుధవారం 'పెన్షన్ అదాలత్' జరిగింది. ముందుగా కమిషనర్ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత అదాలత్‌లో ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల కంటే పెన్షనర్ల ఇబ్బందులు తీర్చడానికే తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. అవసరమైతే ఎప్పుడైనా తనను కలవొచ్చని పేర్కొన్నారు. పెన్షనర్ల సంఘం రాష్ట్ర నాయకులు గద్దె తిలక్, టి.వివేకానందలు మాట్లాడుతూ.. కమిషనర్ తమకు బాసటగా నిలవటం అభినందనీయం అన్నారు. జీఎస్టీ జాయింట్ కమిషనర్ బి. లక్ష్మీనారాయణ, అధికారులు సీతారామరాజు, పాండురంగారావు, సచ్చిదానంద, జవహర్ బాబు, కల్పన, గాదె శ్రీనివాసరెడ్డి, ఈశ్వర్, పూర్ణ సాయి, ప్రశాంత్, సుధీర్, పెన్షనర్ల సంఘ నాయకులు గుమ్మడి సీతారామయ్య చౌదరి, పి.వి.సత్యనారాయణ, పి.కోటేశ్వరరావు, సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు .

17న ఎస్జీటీల సర్టిఫికెట్ల పరిశీలన

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు నగరపాలక సంస్థ పాఠశాలల్లో పని చేస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతులు కల్పించేందుకు ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ నిర్వహించనున్నారు. ఈ నెల 17వ తేదీన ఉదయం 11 గంటలకు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఈ ప్రక్రియ ఉంటుందని డీఈవో పి.శైలజ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన ఎస్జీటీలు ఒరిజినల్ సర్టిఫికెట్లు, సర్వీసు పుస్తకంతో హాజరు కావాలని సూచించారు.

20న క్యారమ్స్ జట్ల ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఎన్టీఆర్ జిల్లా క్యారమ్స్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలోని బ్లాక్-2లో రాష్ట్ర స్థాయి బాల, బాలికల క్యారమ్స్ జట్లను ఎంపిక చేయనున్నారు. ఈ మేరకు ఏపీ స్టేట్ క్యారమ్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 17వ తేదీ సాయంత్రంలోపు 99511 15678 ఫోను నంబర్‌లో సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

మువ్వన్నెలతో ముస్తాబు




స్వాతంత్ర్య దిన వేడుకలకు బుధవారం రాత్రి ముస్తాబైన గుంటూరు రైల్వే స్టేషన్



గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం



రైల్వే డీఆర్ఎం కార్యాలయం



గుంటూరు నగరపాలక సంస్థ

సమరయోధుల స్మారక ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభం



సెల్యూట్ చేస్తున్న డీఆర్ఎం రామకృష్ణ, అధికారులు

లక్ష్మీపురం: స్వాతంత్ర్యం కోసం పోరాడిన వారి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకునేలా ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామని డీఆర్ఎం రామకృష్ణ అన్నారు. గుంటూరు రైల్వే స్టేషన్ ఒకటో ప్లాట్‌ఫాంపై హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఏర్పాటైన ఈ ఎగ్జిబిషన్‌ను బుధవారం డీఆర్ఎం ప్రారంభించారు. తర్వాత ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ సందర్శించేలా ఏర్పాట్లు చేశామన్నారు. అనంతరం స్టేషన్ ప్రాంగణంలో నాటకాలను ప్రదర్శించారు. సీనియర్ డీపీఓ హనూర్, డీసీఎం కమలాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

స్నాక్స్ అందించండి..!

- స్వాతంత్ర్య వేడుకలకు సచివాలయ ఉద్యోగులకు డ్యూటీ
- తమను అవమానిస్తున్నారని సిబ్బంది ఆవేదన
- బీటెక్, ఎంటెక్‌లు చదివిన మాకు ఈ పనులా?
- ప్రభుత్వ తీరును ఖండించిన రాష్ట్ర అధ్యక్షులు రజాక్



సచివాలయ ఉద్యోగులు స్నాక్స్ అందించాలంటూ ఇచ్చిన ఆదేశాలు

గుంటూరు వెస్ట్: 'స్వాతంత్ర్య వేడుకలకు వచ్చే వారికి స్నాక్స్ అందించండి...' ఇది కేటరింగ్ సిబ్బందికి ఇచ్చిన ఆదేశం కాదు సుమా! ఏకంగా సచివాలయ సిబ్బందికి ప్రభుత్వం ఇచ్చిన ఆదేశం. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి సచివాలయ సిబ్బందికి అవమానాలు ఎదురవుతూనే ఉన్నాయి. తాజాగా గురువారం గుంటూరులోని పోలీస్ పరేడ్ మైదానంలో జరగనున్న స్వాతంత్ర్య వేడుకలో ముఖ్య అతిథిగా మంత్రి నారా లోకేష్ పాల్గొననున్నారు. ఈ వేడుకలకు హాజరయ్యే అతిథులకు టీ, కాఫీ, స్నాక్స్‌లాంటివి అందించేందుకు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందిని నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశాల మేరకు సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూధనరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, పెదకాకాని మండలాలకు సంబంధించిన వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు 50 మందిని దీనికోసం నియమించారు. గురువారం ఉదయం ఆరు గంటల నుంచి కార్యక్రమం పూర్తయ్యే వరకు వీరందరూ స్నాక్స్ అందించే పనిలోనే నిమగ్నమై ఉండాలి.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన కఠినతరమైన పరీక్షా విధానంలో సుమారు 1.20 లక్షల మందిని సచివాలయాలల్లోని వివిధ విభాగాలకు నియమించింది. గ్రూప్-3 క్యాడర్‌ను కూడా కేటాయించింది. దీంట్లో 75 శాతంపైగా బీటెక్ గ్రాడ్యుయేట్లు ఉండగా, మిగతా వారిలో ఎంటెక్, ఎంఫిల్, పీహెచ్‌డీ చేసిన వారు కూడా ఉన్నారు. ఒక విధంగా దేశంలో సచివాలయ సిబ్బంది ఒక సంచలనమే చెప్పాలి. ఎన్నో రాష్ట్రాల నుంచి ప్రతినిధులు వచ్చి ఈ వ్యవస్థ పనితీరును అభినందించారు. అంతటి ప్రాముఖ్యత ఉన్న ఈ వ్యవస్థలోని యువ ఉద్యోగులను స్నాక్స్ అందించేందుకు అధికారులు నియమించడం అత్యంత దారుణమని బాధితులు వాపోతున్నారు. ఇలాంటి పనులకు వీఆర్ఏ, అంగన్‌వాడీలు, మున్సిపల్ సిబ్బందిని నియమిస్తారు.

ఇది అత్యంత దారుణం

ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దారుణం. ఉన్నత విద్యనభ్యసించి, గౌరవ ఉద్యోగంలో పారదర్శకంగా విధులు నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బందిని స్నాక్స్ అందించేందుకు నియమించడం తీవ్రంగా బాధిస్తోంది. ఉద్యోగులు కూడా దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ముఖ్య అతిథిగా విచ్చేస్తున్న మంత్రి నారా లోకేష్ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్తాం. భవిష్యత్తులో ఇలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకుంటాం.



\- షేక్ అబ్దుల్ రజాక్, రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం

వైద్యులకు రక్షణ కల్పించాలని డిమాండ్



నిరసన తెలుపుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్, వైద్యుల సంఘం నేతలు

గుంటూరు మెడికల్: వైద్యులకు రక్షణ కల్పించాలని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు. కోల్‌కత్తాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనపై గుంటూరు మెడికల్ కళాశాల జూనియర్ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం జీజీహెచ్‌లో నిరసన తెలిపారు. వైద్య విద్యార్థులు, జూనియర్ వైద్యులు, వైద్యులు నల్లబ్యాడ్జీలు ధరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. వైద్యురాలిని పొట్టన పెట్టుకున్న నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్స్ యూనియన్ నేతలు ఎస్ఎస్‌వీ రమణ, శ్రీనివాస ప్రసాద్, సంతోష్, నారాయణ రావు, శైలజ, శ్రీనివాస్, భానుప్రకాష్, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్‌తో కేంబ్రిడ్జి వర్సిటీ అవగాహన ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ప్రతినిధులు

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీతో లింగ్వాస్కిల్ సర్టిఫికేషన్ ఇన్ ఇంగ్లిష్ లాంగ్వేజ్‌లో ఇంగ్లండ్‌లోని కేంబ్రిడ్జి యూనివర్సిటీ ఇంగ్లిష్ అసెస్‌మెంట్ విభాగం అవగాహన ఒప్పందం (ఎంఓయూ) చేసుకుందని వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంఓయూకు సంబంధించిన పత్రాలను కేంబ్రిడ్జి వర్సిటీ తరఫున సౌత్ ఏసియా రీజినల్ డైరెక్టర్ అరుణాచలం, సౌత్ ఇండియా డీజీఎం కార్తి సుబ్రమణియన్‌లు, విజ్ఞాన్ వర్సిటీ నుంచి రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ పరస్పరం అందించుకున్నారు. ఈ సందర్భంగా నాగభూషణ్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా తొలిసారిగా ఈ అంశాన్ని తమ వర్సిటీలోనే ప్రయోగాత్మకంగా కేంబ్రిడ్జి వర్సిటీ ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. పరిశోధనల్లో సహకారం, విద్యార్థుల భాషా నైపుణ్యంపై కేంబ్రిడ్జ్ సర్టిఫికేషన్ పరీక్షల ప్రభావాన్ని అధ్యయనం చేసే ఉమ్మడి ప్రాజెక్ట్ ఇప్పటికే పురోగతిలో ఉందని వెల్లడించారు. ప్రత్యేక కోర్సుల ఫలితంగా ఇక్కడి విద్యార్థులు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఆంగ్ల భాషను నేర్చుకోగలుగుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో కేంబ్రిడ్జి కార్పొరేట్ రిలేషన్స్ రీజినల్ మేనేజర్ పద్మజ శివకుమార్, ఈఎల్‌టీ మేనేజర్ మల్లికార్జున నాయుడు పచిపాల, విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

స్వతంత్ర పోరు సాగిందిలా...

విద్యార్థులకు వివరించిన శతాధిక వృద్ధుడు



103 ఏళ్ల వయస్సున్న శేషిరెడ్డితో చిన్నారులు

మున్నంగి(కొల్లిపర): స్వాతంత్ర్య పోరాటాన్ని ప్రత్యక్షంగా చూసిన 103 ఏళ్ల ఆళ్ళ శేషిరెడ్డి ఆనాటి సమర ఘట్టాలను విద్యార్థులకు వివరించారు. మండలంలోని మున్నంగి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(ఆర్) విద్యార్థులు ఉత్సాహంగా అప్పటి విషయాలను తెలుసుకున్నారు. తన నివాసంలో శేషిరెడ్డి చిన్నారులతో మాట్లాడుతూ.. తన తండ్రి వెంకటరెడ్డి మునసుబుగా ఉండేవారని, ఆయనతోపాటు అనుచరులను కూడా అప్పట్లో ఆంగ్లేయులు జైల్లో పెట్టినట్లు తెలిపారు.

తనకు 25 ఏళ్ల వయసు ఉన్నప్పుడు తండ్రితో కలిసి గాంధీ, నెహ్రూ, చక్రవర్తుల రాజగోపాలాచారి వంటి వారిని దగ్గరగా చూశానని గుర్తు చేసుకున్నారు. ఆంగ్లేయుల పరిపాలనలో ప్రజల్ని ఎన్నో బాధలు పెట్టేవారని వివరించారు. దేశంపై ప్రతి ఒక్కరు ప్రేమాభిమానాలతో ఉండాలని కోరారు. పరస్పరం గౌరవించుకుంటూ అన్నదమ్ముల్లా సాగాలన్నారు. ప్రధానోపాధ్యాయులు రాము, ఉపాధ్యాయురాలు సోమరౌతు లక్ష్మీకమల తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో పెద్ది రోజా

గుంటూరు వెస్ట్: జిల్లాలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించే దిశగా అన్ని రాజకీయ పార్టీలు, అధికారులు సహకరించాలని డీఆర్వో పెద్దిరోజా పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో స్పెషల్ సమ్మరి రివిజన్ 2025పై వివిధ రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. రోజా మాట్లాడుతూ.. ఈ నెల 25 నుంచి అక్టోబరు 18వ తేదీ వరకు ఎస్ఎస్ఆర్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. 18 ఏళ్లు నిండిన వారందరిని ఓటర్లుగా నమోదు చేసేందుకు కృషి జరగాలన్నారు. బీఎల్వో ద్వారా ఇంటింటి వెరిఫికేషన్ చేయాలని సూచించారు. 1,500 మంది ఓటర్లుపైగా ఉంటే అక్కడ అదనంగా పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో 20 అదనపు పోలింగ్ స్టేషన్‌లను గుర్తించామన్నారు. కృష్ణా, గుంటూరు పట్టభద్రుల శాసనమండలి సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు పదవీ కాలం వచ్చే మార్చి నాటికి ముగుస్తుందని చెప్పారు. పట్టభద్రుల ఎన్నికల గ్రాడ్యుయేషన్ నమోదు కార్యక్రమం సెప్టెంబరు 30న నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లో నివాసం ఉంటున్న వారు ఓటర్లుగా నమోదు చేస్తామన్నారు. సమావేశంలో స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, జీఎంసీ అడిషనల్ కమిషనర్ ఎ.లక్ష్మీశివజ్యోతి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సర్వే అనంతరం ఆలయ భూమి ఉంటే స్వాధీనం

సాక్షి ఎఫెక్ట్..

మంగళగిరి: పట్టణంలోని శ్రీ లక్ష్మీనృసింహ స్వామి ఆలయానికి చెందిన భూ ఆక్రమణపై వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. బుధవారం సాక్షి దినపత్రికలో 'లక్ష్మీ నరసింహస్వామి భూమి స్వాహా' పేరిట కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై గురువారం స్పందించిన అధికారులు.. సదరు భూమి గతంలో కోర్టు వివాదంలో ఉండగా అక్రమ నిర్మాణాన్ని తొలగించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆక్రమణదారుడు జంజనం మల్లేశ్వరరావు మళ్లీ అదే భూమిలో అక్రమ నిర్మాణం చేపట్టాడన్నారు. కథనం ప్రచురితం కావడంతో ఉన్నతాధికారుల దృష్టికి విషయం తీసుకెళ్లామని చెప్పారు. భూమి వివరాల రికార్డులు పరిశీలించి, సర్వే చేయాలని సూచించారన్నారు. ఆక్రమణకు గురై ఉంటే నోటీసులు జారీ చేసి స్వాధీనం చేసుకోవాలని, అందులో నిర్మించిన నిర్మాణాలను తొలగించాలని సూచించినట్లు తెలిపారు. ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకోవాలన్నారని చెప్పారు. చుట్టూ ఫెన్సింగ్ వేసి మరోమారు ఆక్రమణ జరగకుండా చూడాలని ఆదేశించినట్లు వెల్లడించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.